

ఎరుకుమాంబకు జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతోజలాభిషేకం నిర్వహించారు.



వరాహానదికి జలకళ

అనకాపల్లి: గొలుగొండ, నర్సీపట్నం, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల మీదుగా ప్రవహించే వరహానదికి జలకళ వచ్చింది.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

అరకు ఎంపీ దంపతులకు సత్కారం



ఎంపీ తనూజారాణి, వినయ్ దంపతులను సత్కరిస్తున్న ఎస్సీ,ఎస్టీ జాతీయ నాయకులు

సాక్షి,పాడేరు: అరకు ఎంపీ డాక్టర్ తనూజా రాణి, చెట్టి వినయ్ దంపతులను ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘాల జాతీయ నాయకులు బుధవారం ఢిల్లీలో దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.బరోడాకు చెందిన సంఘ సేవకులు పి.ఎల్.పర్మార్, బెంగళూరు జోన్ నేత సీహెచ్ భాస్కరదాస్, బరోడా నేల జితుభాయ్ పర్మార్, ఢిల్లీ శాఖ ప్రధాన కార్యదర్శి మనోజ్ వారిని సత్కరించి అభినందించారు. దేశ వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ వర్గాల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుని, వారి సంక్షేమం లక్ష్యంగా పనిచేయాలని కోరినట్టు ఎంపీ తెలిపారు.

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దంపతులు

సాక్షి,పాడేరు: కలెక్టర్ దినేష్‌కుమార్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులతో పాటు మాజీ జెడ్పీటీసీ కొర్రా కాసులమ్మ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు.గిరిజన ప్రాంతాల్లోని పెండింగ్ పనులను వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

రెజ్లింగ్ పోటీల్లో పాడేరు డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



రెజ్లింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయ్, కళాశాల అధ్యాపకులు

పాడేరు : తమిళనాడులో గత నెల 28,29 తేదీల్లో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సౌత్ ఇండియా అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలలో బీఏ ఫైనలియర్ చదువుతున్న పి.బుజ్జిబాబు, బీకాం సెకెండ్ ఇయర్ చదువుతున్న జి. అశోక్, బీఏ సెకెండియర్ చదువుతున్న ఎం. రమణ బ్రౌంజ్ పతకాలను సాధించారు. వీరిని బుధవారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టిబ్బాయ్, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, సీనియర్ అధ్యాపకులు కోటేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ కె. ప్రసాద్ నాయుడు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఈదురు గాలులకు నేలకూలిన వృక్షాలు

- వాహన చోదకుల అవస్థలు



ధారకొండ -గుమ్మిరేవుల మధ్య రహదారిపై కూలిన చెట్టు



ఆర్‌వీ నగర్ రహదారిపై పడిన చెట్ల కొమ్మలు

గూడెంకొత్తవీధి: ఈదురు గాలులతో కూడిన వర్షాలకు భారీ వృక్షాలు, వాటి కొమ్మలు రోడ్లకు అడ్డంగా పడటంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మండలంలోని ధారకొండ-గుమ్మిరేవుల ప్రధాన రహదారిలో కమ్మరితోట వద్ద రహదారిపై చెట్టు కూలిపోయింది. దీంతో ఈ మార్గం మొత్తం మూసుకుపోయింది. వాహనాల రాకపోకలు గంటల తరబడి నిలిచిపోయాయి. పాతకోట సంతకు వెళ్లే వ్యాపారులు అనేక అవస్థలు పడ్డారు.ఆర్వీనగర్ సమీపంలో ప్రధాన రహదారిపై చెట్ల కొమ్మలు పడటంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

మన్యంలో అల్లం సిరులు

- రెండేళ్లుగా మార్కెట్‌లో డిమాండ్
- గిరిజనులకు అధిక ఆదాయం
- హైబ్రిడ్ రకం కిలో రూ.130
- దేశవాళీ రకం కిలో రూ.120 చొప్పన విక్రయాలు

గిరి రైతులకు అల్లం సాగు సిరులు కురిపిస్తోంది. రెండేళ్లుగా మార్కెట్లో పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. గతేడాది ఎకరాకు రూ.5లక్షల వరకు ఆదాయం రాగా ఈ ఏడాది కూడా అంతకుమించి ఆదాయం వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ధర ఆశాజనకంగా ఉన్నందున గిరి రైతులు తవ్వకాలు జరిగిన వెంటనే వారపు సంతలకు తరలించి విక్రయిస్తున్నారు.



మాలిసింగారంలో అల్లంను మార్కెట్‌కు తరలించే పనుల్లో నిమగ్నమైన గిరిజన రైతులు



పాడేరులో వ్యాపారులు కొనుగోలు చేసిన అల్లం

సాక్షి,పాడేరు: గత రెండేళ్ల నుంచి తెలుగు రాష్ట్రాల్లో అల్లంకు డిమాండ్ పెరిగింది. మైదాన ప్రాంతాల్లో అల్లం సాగు లేకపోవడంతో అక్కడ వ్యాపారులంతా ఏజెన్సీలో అల్లంపైనే ఆధారపడ్డారు. దీంతో గిరిజన రైతులు పండించే అల్లానికి డిమాండ్ పెరిగింది. రెండేళ్ల క్రితం కిలో అల్లాన్ని కనీసం రూ.50 కూడా వ్యాపారులు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. గత రెండేళ్ల నుంచి కిలో రూ.100కు పైగానే ధర పలుకుతోంది. గతేడాది రూ.150 వరకు ధర లభించింది. వ్యాపారులు రిటైల్‌గా రూ.200కు విక్రయించేవారు. ఎకరాకు రూ.5లక్షల వరకు రావడంతో గిరి రైతులు మంచి ఆదాయం పొందారు. ఈఏడాది కూడా సీజన్ ప్రారంభం నుంచి ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి.హైబ్రిడ్ రకం అల్లంను కిలో రూ.130, దేశవాళీ రకం కిలో రూ.120 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గిరి రైతులు కూడా తవ్వకాలు జరిపిన వెంటనే వారపు సంతలకు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో అమ్మకాలు జోరందుకున్నాయి.

రైతు బజార్లలో అమ్మకాలు

పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో 1200 ఎకరాల్లో అల్లం పండిస్తున్నారు. అరకులోయ, హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు, చింతపల్లి, జీకేవీధి, జి.మాడుగుల, పాడేరు మండలాల్లో భారీగానే సాగవుతోంది.

ఎకరాకు 3వేల కిలోల వరకు అల్లం దిగుబడి వస్తుంది. కిలో రూ.100 ధరతో అమ్మినా ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తోంది. దీంతో గిరి రైతులు కూడా ఈ సాగు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. అరకులోయ మండలం చినలబుడు పంచాయతీ గిరిజనులు విశాఖలోని రైతుబజార్లకు తీసుకువెళ్లి విక్రయిస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు.

ఆదాయం బాగుంది



గత రెండేళ్ల నుంచి అల్లం పంట సాగు ద్వారా మంచి లాభాలు పొందుతున్నా. అర ఎకరా విస్తీర్ణంలో హైబ్రిడ్ రకం అల్లం సాగు చేపట్టా. కిలో రూ.130 ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది అన్ని ఖర్చులు పోను రూ.1.50 లక్షల ఆదాయం వచ్చింది.ఈ ఏడాది కూడా అమ్మకాలను ప్రారంభించా. మార్కెట్‌లో ధర బాగున్నందున మంచి ఆదాయం వస్తుంది.

– గొల్లోరి సుదర్శన్, గిరిజన రైతు, చినలబుడు

ఆశాజనకంగా దిగుబడి

జిల్లాలో పాడేరు డివిజన్‌లో అల్లంను గిరిజన రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు.గత రెండేళ్ల నుంచి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి.అల్లం సాగును ఉద్యానవనశాఖ అన్ని విధాలా ప్రోత్సహిస్తోంది. మైదాన ప్రాంతాల్లో అల్లంకు గిరాకీ ఉండడంతో మన్యంలో వ్యాపారం భారీగా జరుగుతోంది. ఈఏడాది కూడా దిగుబడులు బాగుండడంతో మార్కెట్ పరిస్థితులు కలిసొచ్చాయి.

– రమేష్‌కుమార్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారి, పాడేరు

విప్లవ బాణం అల్లూరి



వీరత్వం.. పౌరుషానికి ప్రాణం పోస్తే కనిపించే రూపం.. అల్లూరి. బ్రిటిషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి. అహింసా పోరాటానికి ఆద్యుడిగా గాంధీని చెప్పుకుంటే.. సాయుధ పోరాటమే శరణ్యమని నమ్మి తమ జీవితాన్నే అర్పించిన ధీరుడు మన్యం వీరుడు. ఆంగ్లేయుల దోపిడీకి గురైన అమాయక గిరిజనుల్లో విప్లవాగ్ని రగిలించి.. తెల్లదొరల గుండెల్లో మరఫిరంగిగా మారి.. తెలుగు నేలపై విప్లవ బీజాలు నాటిన ఆ మహనీయుడు.. వ్యక్తి కాదు సమూహశక్తి. సంగ్రామ భేరి. స్వాతంత్ర్య నినాదం.. నేడు ఆయన 127వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం...

8లో

కాగడాలతో గిరిజనుల నిరసన

బూరుగు, చినకోనెలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్



కాగడాలతో నిరసన తెలుపుతున్న బూరుగు, చినకోనెల గ్రామ గిరిజనులు

అనంతగిరి: ఎన్నాళ్లు చీకట్లో జీవించాలని, కాగడాలే మాకు దిక్కా అంటూ మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ బూరుగు, చినకోనెల గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి కాగడాలను పట్టుకుని నిరసన తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి సుమారు 75 ఏళ్లు పైబడినప్పటికీ ఇప్పటికీ మా గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేనందున చీకట్లో మగ్గుతున్నామని వారు వాపోయారు. రెండు గ్రామాల్లో సుమారు 200 మంది వరకు జీవిస్తున్నామని తెలిపారు. గతంలో పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ తమ గ్రామాలను సందర్శించినప్పుడు విద్యుత్ సౌకర్యం కల్పించాలని విన్నవించామని వారు పేర్కొన్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, విశాఖ సీఎం దీని సీపీఎం జిల్లాకార్యవర్గసభ్యుడు గోవిందరావు ఆధ్వర్యంలో కలిసి సమస్యను వివరించామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మా చీకటి బతుకుల్లో వెలుగులు నింపాలని బూరుగు, చినకోనెల గిరిజనులు కోరారు.

పోలవరం నిర్వాసితుల ఊసెత్తని చంద్రబాబు

- పరిహారం, పునరావాసంపై చర్చించకపోవడం బాధాకరం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీతారాం విమర్శ



మాట్లాడుతున్న సీతారాం

ఎటపాక: కొద్దిరోజుల క్రితం పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించి రోజంతా సమీక్షించిన సీఎం చంద్రబాబు 1.6లక్షల నిర్వాసిత కుటుంబాలకు పరిహారం, పునరావాసంపై చర్చించకపోవడం బాధాకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. బుధవారం ఎటపాకలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కంటే ముందుగా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న పది మండలాల నిర్వాసితుల ప్రస్తుత పరిస్థితులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం కన్నా నిర్వాసితుల పునరావాసంపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం భూమికి భూమి నష్టపరిహారం, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సొందె రామారావు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవీ, కాక అర్జున్, పులుసు బాలకృష్ణ,వీరమ్మ పాల్గొన్నారు.

వంజంగి కొండపై బీటీ రోడ్డు నిర్మాణం

- రూ.2.50 కోట్ల కేటాయింపు
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వజంగిహిల్స్‌కు వెళ్లే మార్గంలో కొండపై రూ. 2.50 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం చేపడుతామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. బుధవారం ఆయన పలు శాఖల అధికారులతో కలిసి వంజంగి హిల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కొత్తవలసకు వెళ్లే ప్రధాన మార్గం తారురోడ్డు జంక్షన్ నుంచి కల్లాల బయలు వరకు సుమారు 3.5 కిలో మీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పనులు ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యావరణానికి హాని తలెత్తకుండా వ్యూ పాయింట్ వద్ద రెయిలింగ్ నిర్మించాలని సూచించారు. పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా రన్నింగ్ వాటర్ సదుపాయంతో కంటైనర్ టాయిలెట్లను నిర్మించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈ అనుదీప్, ఎంపీడీవో సాయి నవీన్, కాడెలి ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణ పాత్రుడు పాల్గొన్నారు.

ఇగ్నోలో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 జూలై ప్రవేశాల గడువును పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు జులై 15 తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నాణ్యమైన కాఫీ దిగుబడుల సాధనకు కృషి

కేంద్ర కాఫీ బోర్డు గౌహతి, చుందల జేడీలు నవీన్‌కుమార్, కరుతమణి



మాట్లాడుతున్న డాక్టర్ కరుతమణి

చింతపల్లి రూరల్: గిరిజన రైతులు నాణ్యమైన కాఫీ దిగుబడులు సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు గౌహతి జాయింట్ డైరెక్టర్ (విస్తరణ) నవీన్‌కుమార్, చుందల జాయింట్ డైరెక్టర్ (విస్తరణ) డాక్టర్ ఎం.కరుతమణి అన్నారు. స్థానిక కాఫీ బోర్డు కార్యాలయంలో ఎఫ్‌పీవో ప్రతినిధులు, గిరిజన కాఫీ రైతులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. రైతులందరూ కలిసికట్టుగా ఎఫ్‌పీవోలుగా ఏర్పడి నాణ్యమైన కాఫీ ఉత్పత్తి చేయడం వల్ల మంచి లాభాలు పొందవచ్చునన్నారు. నాణ్యమైన కాఫీ ఉత్పత్తులు తయారు చేయడానికి మెలకువలు, సలహాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు రైతులకు అందిస్తున్నట్టు చెప్పారు. కాఫీ బోర్డు సేవలను ఎఫ్‌పీవోలు సద్వినియోగం చేసుకొని గిరిజన రైతుల ఆర్థిక ప్రగతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు శివకుమార్, డాక్టర్ శ్రీదేవి, వెంకటరెడ్డి, ఎస్ఎల్‌వోలు శివరామ్, తంగరాజ, వెంకటరాజ్ మనోహరన్, అజిత్‌కుమార్, పాడేరు డీడీ ఎస్.రమేష్, ఐటీడీఏ కాఫీ ప్రాజెక్ట్ ఏడీ అశోక్‌కుమార్, జేఎల్వో ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

వరదలను సమర్థంగా ఎదుర్కొందాం



గోదావరి వరదల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



రక్తనాళ సంబంధిత వ్యాధుల వైద్యశిబిరంలో మాట్లాడుతున్న దినేష్‌కుమార్

- అందరూ సిద్ధంగా ఉండాలి
- సమీక్షలో అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం
- ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచన



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు: చింతూరు డివిజన్లో వరదలు సంభవిస్తే వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన ఎమ్మెల్యే మిరియాల శిరీషా, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, పీవోలు సూరజ్ ధనుంజయ్ గనోరే, కావూరి చైతన్య, ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, డీఎఫ్‌వో బబితతో కలిసి వరద సమయంలో ముందస్తు చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 వరదల అంచనా ఆధారంగా చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరదల కారణంగా నాలుగు మండలాల్లో 30 వేల మంది జనాభాపై ప్రభావితమయ్యే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులతోపాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందుగానే రేషన్ నిల్వ చేయాలని ఆదేశించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన లాంచీలు, మర పడవలను, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బలగాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలకు సరకులు అందించేందుకు రవాణా సౌకర్యంపై దృష్టి సారించాలని, ప్రత్యామ్నాయ రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. పునరావాస కేంద్రాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, కమ్యూనికేషన్ వ్యవస్థ ఉండేలా చర్యలు చేపట్టాలని, వరద పరిస్థితిపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ వరదల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సేవా దృక్పథంతో పనిచేయాలని, అన్ని శాఖ అధికారులు సమన్వయంతో వరదల్లో ప్రజలకు నష్టం కలగకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

మారుమూల గ్రామాలకు సంబంధించి సమస్యలపై అందిన వినతులను సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతూరు డివిజన్లోని రహదారుల సమస్యలు, పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించి వాటి పురోగతిని అర్జీదారులకు తెలపాలని ఆదేశించారు.

40 మందికి రక్తనాళ సంబంధిత వ్యాధి

స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తనాళాల సంబంధిత వ్యాధుల వైద్యశిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. శిబిరంలో 198 మంది రోగులను పరీక్షించారు. 40 మందికి రక్తనాళాల వ్యాధి ఉన్నట్టుగా గుర్తించామని స్థానిక ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. అనంతరం కలెక్టర్ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీసీహెచ్ఎస్ కృష్ణారావు, డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

డివిజన్ కేంద్రమైన చింతూరులో పర్యటించిన కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు వినతి పత్రాలు అందజేశారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సమస్యలు వివరిస్తున్న వీఆర్‌పురం ఎంపీపీ కారం లక్ష్మి



కలెక్టర్, ఐటీడీఏ పీవోకు సమస్యను వివరిస్తున్న కృష్ణనగరం సర్పంచ్ కృష్ణ

వీఆర్‌పురం: మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ కారం లక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములకనపల్లి, రామవరం, రేఖపల్లి, పెదమట్టపల్లి పంచాయితీల్లోని గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. అటవీశాఖ అభ్యంతరాల వల్ల నిలిచిపోయిన పెద్దమట్టపల్లి - చింతూరు మండలం నర్సింగపేట వరకు రహదారిని నిర్మించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. శ్రీరామగిరి, జీడిగుప్ప, తుమ్మిలేరు పంచాయతీల్లో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని కోరామన్నారు. గిరిజనులు సాగుచేస్తున్న అసైన్డ్ భూములను సర్వే చేయించి భూ నష్టపరిహారం ఇప్పించాలని కోరినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పూణెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబు, సర్పంచులు పులి సంతోష్ కుమార్, సవలం మారయ్య, పూనెం సరోజిని, వెట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ, ఎంపీటీసీ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని కృష్ణవరం పంచాయతీ పరిధి చింతలచెరువు- విస్సాపురం ఆర్‌అండ్‌బీ రహదారిని నిర్మాణ పనులను కొనసాగించాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు కృష్ణవరం, నల్లకుంట సర్పంచ్‌లు కృష్ణ, రాములమ్మ వినతిపత్రం అందజేశారు. ఈ రహదారి గోదావరి వరదల సమయంలో నల్లకుంట, మురుమూరు, నందిగామ, గౌరిదేవిపేట, గన్నవరం, కృష్ణవరం, లక్ష్మీపురం, విస్సాపురం గ్రామాలకు ఎంతో ఉపయోగకరమని వారు పేర్కొన్నారు. కొందరు కాంట్రాక్టర్‌ను బెదిరించడం వల్ల పనులు నిలిపివేశారన్నారు. వెంటనే పనులు ప్రారంభించేలా కాంట్రాక్టర్‌కు భరోసా కల్పించాలని వారు కోరారు.

క్లుప్తంగా

డయేరియాపై అప్రమత్తత అవసరం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

రంపచోడవరం: డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి అన్నారు. ఏరియా ఆస్పత్రిలో స్టాప్ డయేరియా క్యాంపైన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, విరోచనాలతో బాధపడుతుంటే తక్షణం ఆస్పత్రిలో చేరాలన్నారు. డయేరియాపై గర్భిణులు, చంటి పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించాలని, నిల్వ ఆహారం తీసుకొద్దని, కాచిన నీటిని వినియోగించాలని సూచించారు. ఆర్ఎంవో ఇందిర, కౌన్సిలర్ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి


కొత్తూరు వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన వృద్ధుడు పూజారి ఒనాత్(53)

ముంచంగిపుట్టు : వనభసింగి పంచాయతీ కొత్తూరు జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పాడేరు నుంచి ముంచంగిపుట్టు వస్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న వనభసింగి పంచాయతీ కేంద్రానికి చెందిన పూజారి ఒనాత్(53)ను బలంగా ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఒనాత్‌ను స్థానికులు ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. అతనికి వైద్యం అందించేలోపే వృద్ధుడు మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. ఈ ఘటనపై వనభసింగి సర్పంచ్ వి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విప్లవ బాణం అల్లూరి

నేడు అల్లూరి జయంతి

- కృష్ణదేవిపేట పార్కులో జయంతి సభకు భారీ ఏర్పాట్లు
- హాజరు కానున్న స్పీకర్ అయ్యన్న



అతడే ఒక సైన్యం. అనితర సాధ్యం అతని సాహసం. తెల్లదొరల గుండెల్లో వణుకు పుట్టించిన యోధుడు. గిరిజనుల్లో విప్లవాగ్ని రగిలించి, బ్రిటిష్ పాలనపై యుద్ధం ప్రకటించిన అసమాన వీరుడు. వలసపాలన నుంచి దేశమాతను రక్షించేందుకు ప్రాణాలనే పణంగా పెట్టిన ధీరోదాత్తుడు. అందుకే ఈనాటికీ ఆ మహనీయుడు చిరస్మరణీయుడిగా నిలిచాడు. స్ఫూర్తి రగిలిస్తూనే ఉన్నాడు.

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127 జయంతి వేడుకలు గొలుగొండ మండలంలోని కృష్ణదేవిపేట (ఏఎల్‌పురం)లో గురువారం నిర్వహించనున్నారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడితో పాటు పలువురు ప్రముఖులు హాజరై అల్లూరికి నివాళులర్పించనున్నారు. నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్కు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, వెలుగు, అంగన్‌వాడీ సిబ్బంది ముగ్గులు వేయించారు. గురువారం కృష్ణదేవిపేట గ్రామం నుంచి పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించి మన్యం వీరుడికి ఘన నివాళులు అర్పించనున్నారు. బ్రిటిష్ పాలకుల కబంద హస్తాల నుంచి అమాయక గిరిజన ప్రజల విముక్తి కోసం అల్లూరి చేసిన పోరాటం ఈ ప్రాంతంలో మరువలేనిది. గెరిల్లా యుద్ధం చేసి తెల్లదొరలను గడగడలాడించిన అల్లూరిని కొయ్యూరు మండలంలో హతమార్చి ఆయన మృతదేహానికి కృష్ణదేవిపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. గురువారంనాటి కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర క్షత్రియ సంఘం సభ్యులతోపాటు జాతీయ అల్లూరి యువజన సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు కూడా పాల్గొంటున్నారు. ఏర్పాట్లపై ఆర్డీవో జయరాం బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు.


పార్కులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం


ముగ్గులు వేస్తున్న సిబ్బంది

బస చేసిన గ్రామమిది..


దద్దుగుల గ్రామం

నాతవరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నాతవరం మండలంలోని దద్దుగుల గిరిజన గ్రామంలో కూడా పర్యటించారు. ఇక్కడి ప్రజల ఆతిథ్యం స్వీకరించి, రాత్రి బస చేశారు. అందుకు గుర్తుగా ఇక్కడ అల్లూరి జయంతి, వర్ధంతి వేడుకలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. 1922లో సరుగుడు పంచాయతీ శివారు దద్దుగుల గ్రామానికి అల్లూరి వచ్చారు. అప్పుడు ఈ ప్రాంతం కొయ్యూరు సమితి పరిధిలో ఉండేది. పితూరి కాలంలో సీతారామరాజు కృష్ణదేవిపేట నుంచి తూర్పుగోదావరి జిల్లా పెదమల్లాపురానికి దద్దుగుల గ్రామం మీదుగా వెళ్లేవారు. ఆయన గ్రామానికి వచ్చేసరికి చీకటి కావడంతో అప్పటి గ్రామపెద్ద గొల్లపల్లి ఊబయ్య ఆతిథ్యం ఇచ్చారు. అల్లూరి సీతారామరాజుతో పాటు ఆయన అనుచర బృందానికి మంచి విందు ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో సీతారామరాజు గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేసి బ్రిటిష్ ప్రభుత్వం మన సంపదను ఏవిధంగా దోచుకుంటున్నదో వివరించారు. అల్లూరి ప్రసంగం విన్న గొల్లపల్లి కుటుంబీకులతోపాటు పలువురు గ్రామస్తులు స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్నట్టు పెద్దలు చెప్పారు.

నేడు దద్దుగులలో స్మారక సభ

అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా దద్దుగుల గ్రామంలో గిరిజన సమన్వయ కమిటీ, గిరిమిత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి స్మారక సభ ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అల్లూరి నడయాడిన ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని గిరిమిత్ర స్వచ్ఛంద సేవా సంఘం ప్రతినిధి బండి గంగరాజు కోరారు. గురువారం జరిగే సభలో ఈ ప్రాంత గిరిజనులమంతా ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టరుకు నివేదిస్తామన్నారు.

జీవో నంబర్ 117 రద్దు చేయాలి

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ
- ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

చింతపల్లి రూరల్: జీవో నంబర్ 117 రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిస్తామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. స్థానిక అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ భవనం వద్ద బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జోనల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘువర్మ మాట్లాడుతూ జీవో నంబరు 117 వల్ల 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేయడం వల్ల టీచర్ పోస్టులు తగ్గిపోయాయన్నారు. అంతేకాకుండా మైదాన ప్రాంతం నుంచి గిరిజన ప్రాంతాలకు అధికంగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యాయన్నారు. అందువల్ల జీవో నంబరు 117 రద్దు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సర్వీసు రూల్స్‌ను తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న సమస్యల ప్రభుత్వం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రావుల జగన్మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు శశికుమార్, జోనల్ కార్యదర్శి బౌడు గంగరాజు, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రరావు, మహేష్, ఎంఈవో పనసల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎర్ర మిరపకాయల గుత్తి.. బ్రిటీషర్లు హడల్..


అల్లూరి సీతారామరాజు దాడి చేసిన అడ్డతీగల పోలీస్‌స్టేషన్


రంపచోడవరం: ఆంగ్లేయుల అకృత్యాలపై విల్లంబులు ఎక్కుపెట్టిన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు సాగించిన మహోజ్వల సాయుధ పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే. ఈ పోరాటంలో భాగంగా ఆయన సారథ్యంలో గిరిజన వీరులు బ్రిటిష్ పోలీస్‌స్టేషన్లపై వరస దాడులు చేశారు. దాడులు చేయడంలో అల్లూరి తెగింపే వేరు. ముందుగానే దాడులు చేస్తున్నట్లు బ్రిటిష్ సైన్యానికి హెచ్చరిక సందేశం పంపేవారు. కాగితంపై రాసిన ఆ సందేశాన్ని బాణానికి గుచ్చి, దానిపై ఎర్ర మిరపకాయల గుత్తి తగిలించేవారు. ఎర్ర మిరపకాయల గుత్తితో పోలీస్‌స్టేషన్ వద్ద బాణం నాటుకొంటే చాలు.. బ్రిటిష్ సైనికులు హడలెత్తిపోయేవారు.

పైడిపుట్ట వద్ద నివాసం

బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవాగ్నిని రగిలించిన సీతారామరాజు.. అడ్డతీగల మండలం పైడిపుట్ట వద్ద కొంతకాలం నివాసం ఉన్నారు. 1922లో ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కృష్ణదేవీపేట పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. అక్కడి ఆయుధాలను కొల్లగొట్టి దాడి చేసినట్లు సమయం తెలుపుతూ ఉత్తరం ఉంచారు. కొద్ది రోజుల్లోనే రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. ఈ దాడికి తర్వాత కొంత సమయం తీసుకోవడంతో తమకు సీతారామరాజు భయపడ్డాడని బ్రిటిష్ అధికారులు ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో అడ్డతీగల మండలం పైడిపుట్ట వద్ద ఆయన గిరిజనులతో సమావేశమయ్యారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌పై దాడి చేస్తున్నట్లు 1922 అక్టోబర్ 10న బాణానికి మిరపకాయ గుత్తి ఉంచి సందేశం పంపించారు. అడ్డతీగల స్టేషన్‌పై దాడి చేసేందుకు గుర్రం మీద తేనెలమంగిలోని తెల్లమద్ది చెట్టు వద్దకు రాత్రి చేరుకుని వ్యూహం రచించారు. 1922 అక్టోబర్ 15న దాడి చేసి ఆయుధాలు కొల్లగొట్టారు. స్టేషన్‌పై దాడి చేసినట్లు లేఖ ఉంచారు. ఆ తర్వాత నాలుగు రోజుల వ్యవధిలోనే అక్టోబర్ 19న రంపచోడవరం పోలీస్‌స్టేషన్‌పై కూడా అల్లూరి దాడి చేశారు. అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసేందుకు రంగం సిద్ధం చేసుకునే సమయంలో అనేక గ్రామాల్లో గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో రంపచోడవరానికి సమీపంలోని రంప గ్రామాన్ని ఆయన సందర్శించారు. అక్కడ గిరిజనులతో సమావేశమయ్యారు. 1880లో జరిగిన రంప పితూరి గురించి మాట్లాడారు. గిరిజనులతో సమావేశం అనంతరం రంప జలపాతంలో స్నానం చేసి.. రంపలోని కొండపై, కొండ దిగువన శివాలయాల్లో పూజలు చేసి వెళ్లిపోయారు.


అల్లూరి దాడి చేసిన రంపచోడవరం పోలీస్‌స్టేషన్


అల్లూరి బాల్యంలోని ఫొటో, చనిపోయిన తర్వాత..


అల్లూరి సీతారామరాజు నేపాల్ వెళుతున్నట్టు ముఠాదారుకు రాసిన లేఖ

చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై మొదటి దాడి


అల్లూరి దాడి చేసిన చింతపల్లి పోలీస్‌స్టేషన్ ఇదే..

చింతపల్లి రూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తొలిసారిగా చింతపల్లి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి బ్రిటిషర్లను గడగడలాడించారు. 300 మంది అనుచరులతో స్టేషన్‌లోకి ప్రవేశించి.. తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. ముందుగానే సమాచారం పంపి.. చెప్పినట్టుగానే దాడికి దిగడం అల్లూరి ధైర్యానికి, సాహసానికి నిదర్శనం. ఒక్కసారిగా అనుచరులతో స్టేషన్‌పై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకుంటుండగా.. బ్రిటిష్ సైనికులు నిశ్చేష్టులుగా చూస్తూ ఉండిపోయారు. స్టేషన్ డైరీలో అల్లూరి సంతకం కూడా చేశారు.

గిరిజనుల ఆరాధ్యదైవం

కొయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి పుట్టింది పద్మనాభం మండలం పాండ్రంగిలో అయినా.. ఆయన పోరాటం చేసింది ఎక్కువగా కొయ్యూరు, చింతపల్లి, గూడెం, కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి, అడ్డతీగల ప్రాంతాల్లోనే. అల్లూరి పోరాటాన్ని అణిచివేసేందుకు బ్రిటిష్ పాలకులు చేసిన ప్రయత్నాలు చాలా కాలం ఫలించలేదు. చివరకు మంప కొలనులో స్నానం చేస్తున్న అల్లూరిని పట్టుకుని రాజేంద్రపాలెంలో కాల్చి చంపారు.


మంపలో అల్లూరి స్నానం చేస్తుండగా పట్టుకున్న బ్రిటీష్ సేనలు(ఊహా చిత్రం)


మంపలో అల్లూరి పట్టుబడిన చోట స్మారక స్థూపం

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

- పసుపు సాగుపై అవగాహన అవసరం
- రైతులకు ఆదాయం పెంచేందుకు ప్రత్యేక చర్యలు
- రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ భాస్కరరావు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ భాస్కరరావు

హుకుంపేట: ఏజెన్సీలో ఆదివాసీలు సాగు చేస్తున్న పసుపు పంట ద్వారా ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నట్టు రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ ఎల్.భాస్కరరావు తెలిరు. ఈ మిర్చా ప్రాజెక్టులో భాగంగా ఉద్యానశాఖ డిజిటల్ గ్రీన్ సంస్థల ఆధ్వర్యంలో పసుపు సాగులో మేలైన యాజమన్య పద్ధతులపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది రైతు ఉత్పత్తిదారుల సంఘల ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ ఎల్.భాస్కరరావు మాట్లాడుతూ ఏజెన్సీలో సేంద్రియ పద్ధతిలో పసుపును సాగు చేస్తున్న రైతులు సరైన యాజమాన్య పద్ధతులను అవలంబించకపోవడం వల్ల దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త పీ.బి.ప్రదీప్ మాట్లాడుతు ఏజేన్సీ ప్రాంతంలోని గిరిజనులు అధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్న నాణ్యమైన పసుపును పొందలేకపోతున్నారన్నారు. కె.వి.కె.శాస్త్రవేత్త సత్తిబాబు మాట్లాడుతూ పసుపులో ప్రారంభం నుంచి దిగుబడులు సాధించే వరకు సరైన యాజమాన్య పద్ధతులు అవలంభించడంతో నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయన్నారు. వ్యవసాయ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ నాణ్యమైన పసుపు సాగులో రైతులు మెలకువలు పాటించాలన్నారు. కేవీకే ప్రోగ్రామ్ మేనేజర్ రాజ్‌కుమార్, ఉద్యాన అధికారులు ప్రియాంక, శరణ్య,మాధవి, డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్ వ్యవసాయ,ఉద్యానశాఖ తదితర అధికారులు పాల్గొన్నారు.

'ఆ ఉత్తర్వులు రద్దు చేయాలి'

రంపచోడవరం: ఏజెన్సీలో రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సెలవుల కోసం ముందస్తుగా ఏటీడబ్ల్యూవో ద్వారా కచ్చితంగా అనుమతి పొందాలనే ఉత్తర్వులు రద్దు చేయాలని ఏపీటీడబ్ల్యూటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.గతంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అథారిటి ద్వారా బోధన, బోధనేతర సిబ్బంది సెలవులు పొందేవారు. కచ్చితంగా ఏటీడబ్ల్యూకోను కలిసి సెలవు పొందాలంటే లోతట్టు ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులు కనీసం వంద కిలోమీటర్లు ప్రయాణించి రావాల్సిన పరిస్థితి. వాట్సాప్ ద్వారా కూడా సెలవు పొందాలంటే ఫోన్లు పనిచేయని పరిస్థితి. యాప్‌లో హాజరు కోసం కొండలు ఎక్కి, పక్క ఊరికి వెళ్లి హాజరు వేయాల్సి వస్తున్నందున ఉపాధ్యాయులను వేధించే చర్యలు మానుకోవాలన్నారు. లేదంటే ఉపాధ్యాయులను అసహనానికి గురి చేసిన వారవుతారని ఆరోపించారు. గిరిజన ప్రాంతంలో సరికొత్త వ్యూహాత్మక ప్రణాళికను చేసుకోవాలని, ఏజెన్సీలో విద్యాభివృద్ధికి అందరూ సహకరించాలని నాయకులు కారం రంగారావు, కారుకోడి గాంధీబాబు, మంగిరెడ్డి, కరుణావిలాస్ తదితరులు పేర్కొన్నారు.

ఏయూ పరిధిలో పరీక్షలు వాయిదా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన పలు డిగ్రీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ విద్యార్థి సంఘాలు ఈ నెల 4న బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో డిగ్రీ రెండవ, నాల్గో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. బి.ఎ., బి.ఎస్సీ, బి.కాం, బీసీఏ, బీబీఏ, బీహెచ్ఎంఅండ్‌సీటీ కోర్సుల పరీక్షలు వాయిదా వేశామని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

కోస్టల్ రైడర్స్ బోణీ

ఖాతా తెరవని టైగర్స్


బ్యాటింగ్ చేస్తున్న రషీద్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడవ సీజన్‌లో కోస్టల్ రైడర్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. వైఎస్సార్ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై ఎనిమిది పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడో సీజన్ తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన రైడర్స్ టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. ఓపెనర్ కెప్టెన్ రషీద్47 బంతుల్లో ఐదు ఫోర్లు,మూడు సిక్సర్లతో 67 పరుగులు చేసి గట్టి పునాది వేశాడు. మరో ఓపెనర్ టెండూల్కర్ ఆరు పరుగులకే వెనుదిరగ్గా అతని స్థానంలో వచ్చిన అభిషేక్ 22 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో కెప్టెన్‌కు సహకరించి స్కోర్‌ను పరుగులెత్తించాడు. ధరణి, వర్ధన్‌లు చెరో 14 పరుగులు చేశారు. రామన్ 19 పరుగులతో నిలిచాడు. రషీద్ ఆట చివరి బంతి వరకు ఆడి ఆరో వికెట్‌కు 40 పరుగులు జోడించి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. టైగర్స్ బౌలర్ సాయితేజ రెండు వికెట్లు తీయగా హరిశంకర్, అఖిల్, లలిత్ చెరో వికెట్ పడగొట్టారు.

చివర్లో తడబాటు.. బెజవాడ టైగర్స్ చివర్లో తలబడ్డారు. నాలుగు వికెట్లకు 128 పరుగుల వద్ద కెప్టెన్ రికీబుయ్ (34) వెనుతిరగడంతో మరో 11 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ ధ్రువ్ 29 బంతుల్లో 45 పరుగులు చేసి గట్టి పునాది వేశాడు. మరో ఓపెనర్ మహీప్(9), లక్ష్మణ్(10) స్కోర్‌ను పెంచే క్రమంలో పెవిలియన్‌కు చేరాడు. కెప్టెన్ రికీతో కలిసి అవినాష్(42) నిలకడగా ఆడుతూ స్కోర్‌ను పెంచారు. చివరికి తొమ్మిది వికెట్లకు 162 పరుగులతో టైగర్స్ ఇన్నింగ్స్ ముగిసింది. స్టీఫెన్, ప్రమోద్, మ్యాచ్‌లో గేమ్ చేంజర్‌గా స్టీఫెన్, సూపర్ స్ట్రయికర్‌గా అభిషేక్, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రషీద్ నిలిచారు.

రాయలసీమ కింగ్స్ బాదేశారు

ఏపీఎల్ మూడో సీజన్‌లో భాగంగా బుధవారం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ గోదావరి టైటాన్స్‌పై విజయం సాధించింది. మరో పది బంతులుండగానే కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. కెప్టెన్ జ్ఞానేశ్వర్ ఓపెనర్‌గా 20 పరుగులు చేయగా మరో ఓపెనర్ విమల్‌కృష్ణ 35 బంతుల్లో మూడు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 57 పరుగులు చేశాడు. ప్రసాద్ 21, శశికాంత్ 36 పరుగులతో రాణించారు. దీంతో ఏడు వికెట్లకు 175 పరుగులకు టైటాన్స్ ఇన్నింగ్స్ ముగిసింది. గిరినాథ్, సత్యనారాయణ చెరో రెండు వికెట్లు తీశారు. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన రాయలసీమ కింగ్స్ తొలి బంతినే బౌండరీకి తరలించిన హనీష్ మూడో బంతికి శశికాంత్ బౌలింగ్‌లో జ్ఞానేశ్వర్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ప్రశాంత్ 41 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 49 పరుగులు చేశాడు. రోషన్ అజేయంగా 70 పరుగులు చేయగా గిరినాథ్ ఏడు పరుగులతో నిలిచాడు. రోహిత్ 39 పరుగులు చేశాడు. రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించగా మూడో వికెట్‌కు 71 పరుగులు నమోదు చేసి.. కింగ్స్ విజయకేతనం ఎగురవేశారు. రోషన్ మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు.